సాక్షి
కామారెడ్డి
మంగళవారం ¦ 8 ¦ ఆగస్టు ¦ 2023



ప్రజావాణిలో 59 ఫిర్యాదులు..

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 59 ఫిర్యాదులు నమోదయ్యాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులే అధికం..

- 8లో ▸



చేనేత బోర్డు ప్రారంభించాలి

చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ర్యాలీ తీశారు. చేనేత బోర్డును పునఃప్రారంభించాలని కోరారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /22.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

14న మంత్రి కేటీఆర్ రాక

సాక్షి, కామారెడ్డి/ఎల్లారెడ్డి: మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ జిల్లా పర్యటన ఖరారైంది. ఆయన ఈనెల 14న కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలో రోడ్ల విస్తరణ పనులతోపాటు స్వాగత తోరణం వంటి వాటిని ఆయన ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. ఎల్లారెడ్డిలోనూ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. కేటీఆర్ తన నాయినమ్మ ఊరు బీబీపేట మండలం కోనాపూర్‌లో సొంత డబ్బులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది. వచ్చే నెలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిసింది.

ఎల్లారెడ్డిలో సభ..

ఎల్లారెడ్డికి ఈనెల 14న మంత్రి కేటీఆర్ రానున్నారని ఎమ్మెల్యే సురేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల అనంతరం నిర్వహించే సభలో పాల్గొంటారని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ



కామారెడ్డి అర్బన్: జాతీయ జావెలిన్ త్రో దినోత్సవం సందర్భంగా తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా క్రీడాకారులు ప్రతిభచూపి మూడు పతకాలు సాధించారని, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్ కుమార్ తెలిపారు. అండర్–14 విభాగంలో కే.ఆనంద్ రజత పతకం, మహిళల 400 మీటర్ల పరుగులో టి. లక్ష్మి రజత పతకం, అండర్–20 జావెలిన్‌త్రో విభాగంలో ఎస్. బాలయ్య కాంస్య పతకం సాధించారన్నారు. విజేతలను అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

'తపస్ ఉద్యమ జాగరణ' కరపత్రాల ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తపస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమ జాగరణ కరపత్రాలను సోమవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం గతనెల 18న ఉద్యమ జాగరణ చేపట్టామన్నారు. పాఠశాల, మండల, డివిజన్ స్థాయి కార్యక్రమాలు పూర్తయ్యాయన్నారు. ఈనెల 10న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు, పీఆర్సీ, ఆరోగ్య కార్డులు, పెండింగ్ బిల్లుల విడుదల మొదలైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి విజయ్ కుమార్, రిసోర్స్ పర్సన్స్ అశోక్, రమేష్‌రెడ్డి, రజని తదితరులు పాల్గొన్నారు.

'గ్రూప్ -2 పరీక్షలు వాయిదా వేయాలి'



కామారెడ్డి టౌన్: గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం వద్ద నిరసన తెలిపారు. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు తరలివెళ్లి కార్యాలయ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చదువుకోవడానికి సమయం ఇవ్వకుండా వరుసగా జేఎల్, స్టాఫ్ నర్స్, గురుకుల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. గురుకుల పరీక్షలు ఈనెల మొత్తం ఉన్నాయని, సిలబస్ మారడంతో గ్రూప్ 2 మిగతా పరీక్షలకు చదవలేకపోతున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని గ్రూప్ -2ను వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎం విఠల్, వంశీకృష్ణ, రాజేష్, సమీన, హరీష్, శ్రీధర్ గౌడ్, శ్రవణ్, మానస, వాణి, ప్రవళిక, మమత, ఝాన్సీ, కవిత, మనోజ్, అర్బాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల సాగరం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయినిగా పేరుగాంచిన నిజాంసాగర్ ప్రాజెక్టుకు పునాది రాయి పడి వందేళ్లవుతోంది. ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచిన నిర్మాణం అప్పటి ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. – సాక్షి, కామారెడ్డి



నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు(ఫైల్)

- 1923లో నిజాంసాగర్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం
- ఎనిమిదేళ్లలో నిర్మాణం పూర్తి
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టు
- ఏటా రెండు పంటలకూ భరోసా ఇస్తున్న జలాశయం

చెక్కుచెదరని కట్టడాలు..

నిజాంసాగర్ ప్రాజెక్టుతో పాటు పరిసరాల్లో నిర్మించిన కట్టడాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వందేళ్లవుతున్నా చెక్కుచెదరలేదు. పాలకుల నిర్లక్ష్యంతో నిర్వహణలోపం కనిపిస్తుందే తప్ప పెద్దగా దెబ్బతినలేదు. ఇక్కడ ఛత్రిబంగ్లా, గోల్‌బంగ్లా, స్విమ్మింగ్‌పూల్, సమ్మర్‌బాగ్, గెస్ట్‌హౌస్, గుల్‌దస్తా గార్డెన్ వంటి కట్టడాలు చూడముచ్చగా ఉన్నాయి. ప్రాజెక్టు వద్ద విఘ్నేశ్వరాలయం, గంగమ్మ, దుర్గమ్మ, కట్టమైసమ్మ ఆలయాలున్నాయి.

ప్రాజెక్టు చరిత్ర..

1920 సంవత్సరంలో హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుంది. వర్షాలు సకాలంలో కురవక సాగునీరు లేక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు పంటలను వేయలేకపోయారు. కనీసం తాగునీరు కూడా దొరక్క అల్లాడిపోయారు. ప్రకృతి వైపరీత్య పరిస్థితులను సమీక్షించిన అప్పటి నైజాం ప్రభుత్వం భారీ సాగునీటి ప్రాజెక్టు నిర్మించాలని భావించింది. మంజీర నదిపై ప్రాజెక్టు నిర్మాణం కోసం అప్పట్లో ఏడాది పాటు సర్వే చేశారు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట– బంజపల్లి గ్రామాల మధ్యలో మంజీర నదిపై ప్రాజెక్టుకు అనువైన స్థలాన్ని గుర్తించి, 1923 సంవత్సరంలో పునాది రాయి వేశారు. నిజాం ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చీఫ్ ఇంజినీర్‌గా నవాబ్‌అలీ నవాజ్ జంగ్ బహదూర్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్‌గా సీసీ పాలే, అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఎస్‌జీ తారాపూర్‌ను నియమించింది. వీరి పర్యవేక్షణలో ఎనిమిదేళ్ల పాటు పనులు సాగాయి. 1931లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. అనంతర కాలంలో ప్రాజెక్టుకు అనుసంధానంగా హెడ్‌స్లూయిస్ జలవిద్యుదుత్పత్తి కేంద్రం కూడా నిర్మించారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం

30 టీఎంసీల సామర్థ్యంలో..

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 2.75 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో నిజాంసాగర్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. 1400.50 అడుగులతో 30 టీఎంసీల నీటి నిలువ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మించారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదల వల్ల కొంతకాలానికి ప్రాజెక్టులో పూడిక భారీగా పెరిగిపోయింది. 1973లో ప్రభుత్వం నిర్వహించిన పరిశోధనలో.. పూడికవల్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 11.8 టీఎంసీలకు తగ్గిపోయినట్లు తేలింది. దీంతో పునర్నిర్మాణ ప్రతిపాదనలతో ప్రాజెక్టు ఎత్తు 1,405 మీటర్లకు పెంచడంతో నీటి నిల్వ సామర్థ్యం 17.80 టీఎంసీలకు పెరిగింది.

మూడు చోట్ల వరద గేట్లు..

నిజాంసాగర్ ప్రాజెక్టును మూడు కిలోమీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో ఎస్ ఆకారంలో నిర్మించారు. మూడు చోట్ల కలిపి 46 వరద గేట్లను ఏర్పాటు చేశారు. ఈ గేట్ల ద్వారా దాదాపు 6 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయవచ్చు. ప్రాజెక్టులో జలకళను తిలకించేందుకు రాష్ట్రంలోని నలుమూలలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు తరలివస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకుల విడిది కోసం అందమైన గెస్ట్‌హౌస్ కూడా ఉంది. ఏటా వర్షాకాలంలో ప్రాజెక్టు నిండి గేట్లు ఎత్తగానే పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

ప్రాజెక్టును సందర్శించిన దివంగత సీఎం వైఎస్సార్

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిజాంసాగర్ ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టుపై అధికారులతో రివ్యూ నిర్వహించారు. నిజాంసాగర్ కాలువల ఆధునికీకరణకు జలయజ్ఞం కార్యక్రమం ద్వారా సుమారు రూ. 459 కోట్ల నిధులు మంజూరు చేశారు. కాగా వర్షాభావ పరిస్థితులు తలెత్తినపుడు నిజాంసాగర్ ప్రాజెక్టుకు మల్లన్నసాగర్ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకు ఉద్దేశించిన పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పూర్తయితే నిజాంసాగర్ ఎండాకాలంలో అయినా, వానాకాలంలో అయినా నిండుకుండలా ఉంటుందని నీటి పారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

'అభివృద్ధిలో పెద్దమల్లారెడ్డి ఆదర్శం'



పెద్దమల్లారెడ్డిలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

భిక్కనూరు: అభివృద్ధిలో పెద్దమల్లారెడ్డి ఆదర్శంగా నిలుస్తోందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. సోమవారం గ్రామంలో రూ. 17.70 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. నిరుపేదలకు అన్ని గ్రామాల్లో త్వరలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, జెడ్పీటీసీ పద్మ నాగభూషణంగౌడ్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజమౌళి, సర్పంచ్ లక్ష్మీరాజలింగం, ఎంపీటీసీలు సాయాగౌడ్, మంజుల, నాయకులు రాజాగౌడ్, నర్సింహారెడ్డి, సుదర్శన్, మాధవి, లక్ష్మి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం కాదంటే నేనే పోటీ చేస్తా

కామారెడ్డి నుంచి పోటీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తానే స్వయంగా ఆహ్వానించానని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. ఆయన కాదంటే తానే బరిలో ఉంటానన్నారు. సీఎం కేసీఆర్ సొంత గ్రామం బీబీపేట మండలంలోని కోనాపూర్ అన్నారు. మానేరు నిండి పంట పొలాలు మునిగిపోవడంతో కేసీఆర్ కుటుంబం అప్పట్లో చింతమడకకు వలస వెళ్లిందన్నారు. కేసీఆర్ ఇక్కడి నుంచి పోటి చేయాలని తాను మూడుసార్లు కోరానన్నారు. కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తే తన భవిష్యత్తునూ ఆయనే నిర్ణయిస్తారన్నారు. ప్రతిపక్ష నాయకులు కొందరు తాను గెలవనన్న కారణంతోనే కేసీఆర్‌ను కామారెడ్డికి తీసుకువస్తున్నానంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గతంలోనూ తాను ఓడిపోతున్నానని ప్రచారం చేశారని, ప్రజల ఆశీస్సులతో వరుసగా గెలుస్తూ వస్తున్నానని పేర్కొన్నారు.

'తెలంగాణను కాపాడుకుందాం'



పార్టీలో చేరినవారితో షబ్బీర్ అలీ

భిక్కనూరు: ప్రజా ఉద్యమాల ఫలితంగా ఏర్పడ్డ తెలంగాణను బీఆర్ఎస్ నేతలు దోచుకుంటున్నారని, వారి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పేర్కొన్నారు. సోమవారం భిక్కనూరులో వివిధ గ్రామాలకు చెందిన యువకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రివర్గంలో మెజారిటీ మంత్రులు తెలంగాణ ద్రోహులేనన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని సీఎం కేసీఆర్ పార్టీలో చేర్చుకుని వారికి ఉన్నత పదవులు కట్టబెట్టి, ఉద్యమకారులకు ద్రోహం చేశారని ఆరోపించారు. సీఎం పదవి నుంచి కేసీఆర్‌ను దించాలని ప్రజాగాయకుడు గద్దర్ కోరారన్నారు. ఆయన ఆఖరి కోరికను ప్రజలందరు నెరవేర్చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, నేతలు రాజు, సిద్ధాగౌడ్, లింబాద్రి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు తథ్యం

కామారెడ్డి టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు తథ్యమని షబ్బీర్ అలీ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం యువజన కాంగ్రెస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హామీలిస్తూ అరచేతిలో స్వర్గాన్ని చూపి మోసం చేస్తారన్నారు. ప్రభుత్వ భూముల్ని అమ్ముకునే దుస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పాక జ్ఞానేశ్వరి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సందీప్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పండ్ల రాజు, నౌసిలాల్, శ్రీనివాస్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, గుడుగుల శ్రీను, గొనె శ్రీనివాస్ పాల్గొన్నారు.

3.96 లక్షల మొక్కలు నాటుతాం

- సీఎస్‌తో వీసీలో కలెక్టర్ జితేష్ వి పాటిల్



సీఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

కామారెడ్డి క్రైం: స్వతంత్ర భారత వజ్రోత్సవాలలో భాగంగా జిల్లాకు కేటాయించిన 3.96 లక్షల మొక్కల పెంపకం లక్ష్యానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో హరితహారం, బీసీ, మైనారిటీ, దళితబంధు, ఇళ్ల స్థలాల పంపిణీ, గృహలక్ష్మి, గొర్రెల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి సీఎస్‌కు వివరించారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది సంపద వనాల కింద 8 ప్రాంతాలకుగాను 7 ప్రాంతాలలో మొక్కలు నాటామన్నారు. మొక్కలు నాటే పనులను వారం రోజులలో పూర్తి చేస్తామన్నారు.

102 యూనిట్లు అందించాం..

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శితో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ పాటిల్ జిల్లా అధికారులతో మాట్లాడారు. రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం క్రింద జిల్లాలో 102 యూనిట్లు పంపిణీ చేశామన్నారు. నెలాఖరులోగా మరో 300 యూనిట్లను లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. బీసీ, చేతి ,కుల వృత్తిదారుల ఆర్థిక సహాయం కోసం వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పరిశీలించి అర్హులైన వారికి మంజూరు ఉత్తర్వులు జారీ చేయాలని సూచించారు. ఆరోగ్య ఉప కేంద్రాల భవన నిర్మాణ పనులు నాణ్యతతో త్వరితగతిన పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, పశు సంవర్ధక శాఖ అధికారి సింహారావు, నీటిపారుదల శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ అభినందనీయం

కామారెడ్డి అర్బన్: యువతలో నాయకత్వ నిర్మాణం చేయడంతోపాటు నైపుణ్య శిక్షణ అందించడం గొప్ప విషయమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని రామారెడ్డి రోడ్డులో గంగాస్థాన్ సమీపంలో పీపుల్ ఫర్ ఇండియా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రొబొటిక్ క్లబ్, బుక్ క్లబ్‌లను నైపుణ్య శిక్షణలో భాగం చేయడాన్ని అభినందించారు. శంకర కంటి ఆస్పత్రి ద్వారా ఉచిత నేత్ర వైద్యం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ సుతారి రవి, గర్గుల్ సర్పంచ్ రవితేజ గౌడ్, సంస్థ ప్రతినిధులు సూరజ్ పబ్బతి, జక్కుల మనోహర్, సునీత, సందీప్ రాంనాని, అరవింద్‌కుమార్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకు అండగా నిలుద్దాం



చేనేత కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: ప్రజలందరూ చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులకు అండగా నిలవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. డీఆర్డీవో, చేనేత, జౌళి శాఖల ఆధ్వర్యంలో సోమవారం కామారెడ్డిలోని రోటరీ క్లబ్‌లో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు వారానికి రెండు రోజులు చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. చేనేత వారసత్వ సంపదను కాపాడాలన్నారు. చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా కలిగే ప్రయోజనాలపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులను కలెక్టర్, డీఆర్డీవో, చేనేత సంఘాల ప్రతినిధులు సన్మానించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి రోటరీ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యం, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింలు, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, సంఘాల ప్రతినిధులు ఐరేని నర్సయ్య, సబ్బని లక్ష్మణ్, హరినాథ్, సిద్దిరాములు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

చదివి.. కొలువును గెలిచి..

- ఎస్సైగా ఎంపికైన గిరిజన యువతి
- రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు



తల్లిదండ్రులు, చెల్లెళ్లతో శిరీష

బిచ్కుంద: పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకుంది ఓ గిరిజన యువతి. మండలంలోని భద్రాల్ తండాకు చెందిన పవార్ శ్రావణ్, బుచ్చిబాయి దంపతులకు నలుగురు కూతుళ్లు. శ్రావణ్ బాన్సువాడ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పెద్ద కూతురు పవార్ శిరీష ఇటీవల నిర్వహించిన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) రాత పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 17వ ర్యాంకు సాధించింది. దీంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శిరీష 2016లో బిచ్కుంద వీవీఎస్ స్కూల్‌లో పదో తరగతి చదివి, 9.8 గ్రేడ్ పాయింట్లతో మండల టాపర్‌గా నిలిచింది. 2016 –18లో బోధన్‌లోని ఉషోదయ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ చదివిన శిరీష.. 978 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీలో 2021లో డిగ్రీ పూర్తి చేసింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ఎస్సై పరీక్ష కోసం ఏడాది పాటు కోచింగ్ తీసుకుంది. ఎస్సై పరీక్షలో జనరల్ కేటగిరిలో రాష్ట్రస్థాయిలో 17వ ర్యాంకు సాధించి కల నెరవేర్చుకుంది. తన కూతురు కుటుంబానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని ఆమె తండ్రి శ్రావణ్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగం సాధించాలని..



ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కనేదాన్ని. గట్టి సంకల్పంతో కష్టపడి చదివా. చిన్నప్పటినుంచి మంచి ర్యాంకులు సాధించా. ఎస్సై పరీక్షలోనూ ఉత్తమ ప్రతిభ చూపి ఉద్యోగానికి ఎంపికయ్యా. ఆనందంగా ఉంది. తల్లిదండ్రులే నా హీరోలు.. వారి ప్రోత్సాహంతో ఐపీఎస్ లక్ష్యంగా ముందుకు సాగుతా. – శిరీష, ఎస్సైగా ఎంపికైన అభ్యర్థి

క్లుప్తంగా

పార్ట్ టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



కామారెడ్డి అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో 40 ఏళ్లుగా పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్ల సమస్యలను పరిష్కరించకపోవడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, న్యాయవాది వీఎల్ నర్సింహారెడ్డి అన్నారు. కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం వద్ద పార్ట్ టైం స్వీపర్ల నిరసన దీక్షలు సోమవారం నాటికి 43వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం వీఎల్ నర్సింహారెడ్డి, నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యంలు మద్దతు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీకి సర్పంచ్ రాజీనామా



లింగంపేట(ఎల్లారెడ్డి): మాలోత్ తండా సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ సుమన్‌నాయక్, వార్డు సభ్యులు సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలకు నిరసనగా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో 90 మందికి పోడు పట్టాలు రావాల్సి ఉంటే కేవలం 10 మందికే ఇప్పించారన్నారు.

టీటీసీ లోయర్ పరీక్ష వాయిదా

నిజామాబాద్ అర్బన్: ఈ నెల 12న నిర్వహించాల్సిన టీటీసీ లోయర్ (థియరీ) పరీక్ష తేదీలో మార్పు చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఈనెల 27న నిర్వహిస్తామన్నారు.

పరీక్ష ఫీజు చెల్లించాలి

నిజామాబాద్ అర్బన్: సమ్మెటివ్-1, 2 పరీక్షలకు సంబంధించి జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈ నెల 31లోపు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజును డీడీ రూపంలో మాత్రమే చెల్లించాలని పేర్కొన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

నిజామాబాద్ అర్బన్: జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి బీసీ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 13లోపు దోస్త్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9948559189 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

‘సాయం’ కోసం నిరీక్షణ!

- ఆలస్యంగానే బీసీలకు రూ.లక్ష సాయం
- గత నెలలోనే అందాల్సిన సొమ్ము
- నిధులు కేటాయించినా ప్రజాప్రతినిధులు సమయం ఇవ్వకపోవడంతో ఆలస్యం



మోర్తాడ్: కులవృత్తులపై ఆధారపడిన వెనుకబడిన కులాల వారికి రూ.లక్ష సాయం అందించడానికి ఇంకా సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జూలై 15న తొలి విడత సాయం అందించాల్సి ఉంది. ఈ నెలలోనూ 15వ తేది తరువాత రెండో విడత సాయం అందించాలి. జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు సమయం ఇవ్వకపోవడం, నిధులు పరిమితంగానే విడుదల కావడం ఇతరత్రా కారణాలతో సాయం అందించడంలో జాప్యం జరుగుతుంది. ప్రతి నెలా ఒక్కో నియోజకవర్గంలో 300 మందికి సాయం అందిస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించారు. మంత్రి ప్రకటనకు భిన్నంగా జిల్లాలో మొదటి విడతలో అన్ని నియోజకవర్గాలకు కలిపి 300 మందికే లబ్ధి చేకూర్చడానికి నిధులు విడుదలయ్యాయి. జిల్లాకు రూ.3 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ లెక్కన 300 మందికి మాత్రమే సాయం అందించడానికి అవకాశం ఉంది. బీసీలకు ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం 21,125 మంది దరఖాస్తు చేసుకున్నారు. మండలాల వారీగా అధికారులు దరఖాస్తులను పరిశీలించి లబ్ధి పొందడానికి అర్హులు 17,894 మంది అని తేల్చారు. వీరికి ప్రతి నెలా సాయం మంజూరు చేస్తూ కొన్ని నెలల్లో పూర్తి స్థాయిలో లబ్ధి చేకూర్చాల్సి ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 300 చొప్పున అంటే జిల్లాలో ఉన్న 5 నియోజకవర్గాలకు 1,500 మందికి ప్రతి నెలా సాయం అందించాల్సి ఉంది. ఇందుకోసం రూ.15 కోట్లను ప్రతి నెలా కేటాయించాలి. 11 నెలల్లో ఎంపికైన అందరికి సాయం అందించడానికి అవకాశం ఉంది. తొలి విడతలోనే అరకొరగా నిధులను విడుదల చేయడంతో పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు న్యాయం చేకూర్చడానికి ఎక్కువ సమయం పడుతుందని పరిశీలకులకు చెబుతున్నారు.

ప్రచారమే జోరుగా ఉంది



బీసీలకు రూ.లక్ష సాయంపై ప్రభుత్వం చేసిన ప్రచారం జోరుగా ఉంది. ఆచరణలో మాత్రం కొంత మందికే సాయం అంటున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఒక్కరికి కూడా ఇచ్చింది లేదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది బీసీలకు సాయంపై ప్రభుత్వ తీరు.

– రాకేశ్ గౌడ్, మోర్తాడ్

అందరికీ అందించాలి



బీసీలకు రూ.లక్ష సాయం అందరికి అందించాలి. నియోజకవర్గానికి ప్రతి నెలా 300 మందికి అని ప్రచారం చేశారు. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఇవ్వలేదు. బీసీల్లో ఎంతో మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందినవారు ఉన్నారు. వారిపట్ల ప్రభుత్వం కరుణ చూపాలి.

– జక్కం అశోక్, మోర్తాడ్

ప్రజావాణికి 59 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 59 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 39 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించినవే కావడం గమనార్హం. జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న, సీపీవో రాజా రాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆ యా శాఖల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నిజామాబాద్‌లో 103 ఫిర్యాదులు

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కమిషనర్‌తోపాటు, జెడ్పీ సీఈఓ గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

వేతనాల్లో రికవరీని నిరసిస్తూ..

మున్సిపల్ డ్రైవర్ల వేతనాల్లో రికవరీని నిరసిస్తూ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులకు రూ.వెయ్యి పెంచి జీతాలు చెల్లిస్తూ, అనేక కారణాలు సాకుగా చూపి మళ్లీ రికవరీ చేస్తుందన్నారు. డ్రైవర్ల నుంచి కోత విధించిన జీతాలను వెంటనే చెల్లించాలని, పెరిగిన వేతనాలను అమల్జేయాలని డిమాండ్‌చేశారు. డ్రైవర్స్ యూనియన్ నాయకులు చంద్రసింహ, లక్ష్మణ్, నరేష్, మారుతి, వినోద్, సత్యనారాయణ, సాయిలు పాల్గొన్నారు.

మండల సభ బహిష్కరించిన సర్పంచులు

- గ్రామ పంచాయతీలకు నిధులివ్వడం లేదని అసంతృప్తి
- అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సదాశివనగర్ మండల సర్వసభ్య సమావేశం సోమవారం పోలీస్ బందోబస్తు మధ్య జరిగింది. 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశాన్ని 12 గంటలకు ప్రారంభించడంతో సభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ ప్రారంభంలోనే తమ గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయడం లేదని మర్కల్, కుప్రియాల్, భూంపల్లి, మల్లుపేట్ గ్రామాల సర్పంచ్‌లు సభను బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో భాగంగా పనులు మందకొడిగా సాగుతున్నాయని వారు అన్నారు. గ్రామ పంచాయితీ తీర్మానం కానీ, గ్రామ సభ తీర్మానం కానీ లేకుండా రూ.70 వేల చెక్ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీవో గారు ఒత్తిడి తెచ్చారని ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలన్నారు. సదాశివనగర్ పశువైద్య కార్యాలయం ఎప్పుడు తీస్తున్నారో..అధికారులెప్పుడు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉందని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాటిన ప్రతిమొక్కను సంరక్షించాలి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హరితహారంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. బెజుగంచెరువుతండా వైకుంఠధామంలో నాటుతున్న మొక్కలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటుతున్న కూలీలతో మాట్లాడారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అనిత, బీఆర్ఎస్ నాయకుడు హరిలాల్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సాధన సంస్థ పోలీస్ కళాబృందం, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోమవారం లింగంపేట మైనార్టీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాల కార్మికులు, చదువు మానేసిన, తప్పిపోయిన, పారిపోయిన పిల్లల కనబడితే సాధన సంస్థకు సమాచారం ఇవ్వాలన్నారు. బచ్పన్ బచావో ఆందోళన్ హెల్ప్‌లైన్ 18001027222 టోల్ ఫ్రీ నంబర్‌తో పాటు 1098, లేదా పోలీస్ ఎమర్జెన్సీ 100 నంబరుకు డయల్ చేయాలన్నారు.

యువజన కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

కామారెడ్డి టౌన్: కామారెడ్డి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు నూతన యువజన కాంగ్రెస్ అధ్యక్షులను సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వారికి నియామక పత్రాలను అందజేశారు. కామారెడ్డి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా బత్తుల కిషన్, పట్టణ యువజన అధ్యక్షుడిగా గుడుగుల శ్రీనివాస్, రాజంపేట మండల అధ్యక్షుడిగా అంకం కృష్ణారావు, దోమకొండ అధ్యక్షుడిగా ఆశబోయిన శ్రీనివాస్, బీబీపేట్ అధ్యక్షుడిగా జీవన్ రెడ్డి, మాచారెడ్డి అధ్యక్షుడిగా చెల్లాపురం రాజిరెడ్డి, భిక్కనూరు అధ్యక్షుడిగా తిరుపతి గౌడ్‌లను నియమించారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.



నియామకపత్రాలను అందజేస్తున్న షబ్బీర్ అలీ

కాంగ్రెస్ పార్టీలో చేరిక

బీబీపేట: మండల కేంద్రంతో పాటు తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల యువకులు సోమవారం మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆయన ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుతారి రమేష్, సలీం, రవి, చంద్రాగౌడ్, నాగరాజు, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేశాకే పరీక్షలు పెట్టండి

- కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల ధర్నా



ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

కామారెడ్డి టౌన్: వైద్యారోగ్య శాఖలో 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరణ చేశాకే నోటిఫికేషన్‌లు వేసి పరీక్షలు నిర్వహించాలని ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా కాలంలో ఎన్నో సేవలు అందించిన తమని ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. 20 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అదే ఉద్యోగం కోసం మళ్లీ పరీక్ష రాయాలనడం సరికాదన్నారు. తక్షణమే తమని రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట నేడు, రేపు చేపట్టనున్న వంటావార్పు నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఏఎన్‌ఎంలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఏఎన్‌ఎంలు స్వరూప, రేణుక, మంజుల, బాలమణి, జ్యోతి, శ్రీలత, సుశీల, తదితరులున్నారు.

ప్రతి గ్రామంలో సోక్‌పిట్‌లను నిర్మించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్(ఎస్ఎస్‌జీ)లో భాగంగా ప్రతి గ్రామంలో ఐదు కమ్యూనిటీ సోక్‌పిట్(ఇంకుడు గుంత)లను నిర్మించాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులందరూ ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య డీఎస్ఆర్ పూర్తి చేయాలన్నారు. దీంతో పాటు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు ఎస్ఎస్‌జీపై వ్యాస రచన పోటీలు నిర్వహించాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆగస్టు 15న బహుమతులను ప్రదానం చేయాలని చెప్పారు. గ్రామాలలో వసూలు చేసిన ఇంటి పన్నుల నగదును చలానా ద్వారా గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేయాలన్నారు. ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతన్న ఎంపీడీవో రఘు

విద్యార్థి దశ నుంచి యోగా చేయాలి



నిజామాబాద్ సిటీ: విద్యార్థి దశనుంచే యోగా అలవాటు చేసుకోవాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి సూచించారు. ఆదివారం జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో రామకృష్ణ సేవా సమితి గంగాస్థాన్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు జరిగాయి. ఉదయం ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్ పోటీలను ప్రారంభించగా ముగింపు కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ హాజరై విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ క్లబ్ జేమ్స్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించటం ఎంతో సంతోషకరమని క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కాంత్‌రావు అన్నారు. పోటీల్లో 140 మంది విద్యార్థులు పాల్గొనగా మొత్తం 30 మంది విజేతలకు బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్ జేమ్స్ కార్యదర్శి వీరబ్రహ్మం, ప్రోగ్రాం ఇన్‌చార్జి గౌరీ శంకర్, టి బాలశేఖర్, బి సాయిలు, సంగీత పాల్గొన్నారు.

బోధన్‌లో తాళం వేసిన ఇంట్లో చోరీ

బోధన్‌టౌన్: బోధన్‌లోని శక్కర్‌నగర్ కాలనీలో కొమ్ము చంద్రమోహన్ ఇంట్లో చోరీ జరిగింది. చంద్రమోహన్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి తాళం పగిలి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులు, బీరువాలోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలోని తులం బంగారు చైన్‌తోపాటు అరతులం ఉంగరం, రూ.10 వేల నగదు పోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

పొలంలో పడి ఒకరి మృతి



రాములు (ఫైల్)

గాంధారి: మండలంలోని తిమ్మాపూర్‌లో పొలంలో పడి ఒద్దుల రాములు(33) మృతి చెందినట్లు ఏఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన రాములు బతుకు దెరువు కోసం మస్కట్‌కు వెళ్లి గత నెల 14 గ్రామానికి వచ్చాడు. సోమవారం ఉదయం గేదెలకు గడ్డి కోసుకు రావడానికి వెళ్లాడు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగ పొలంలో బురదలో పడి మృతి చెంది ఉన్నాడు. ఫిట్స్‌తో రాములు పొలంలో పడి మృతి చెందినట్లు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

బీహార్ కూలీల గొడవలో కత్తిపోట్లు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని సివిల్ సప్లై గోదాంలో హమాలీ పనులు చేసేందుకు వచ్చిన బీహార్ కూలీల గొడవలో కత్తిపోట్లు చోటు చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. బీహార్‌కు చెందిన ప్రవీణ్, అర్జున్ ఆదివారం రాత్రి గొడవ పడ్డారు. ఈ క్రమంలో ప్రవీణ్, అర్జున్‌ను కత్తితో పొడిచాడు. గాయపడ్డ అర్జున్‌ను నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. ప్రవీణ్ పరారీలో ఉండడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వార్డు సభ్యుడి మృతదేహంతో ధర్నా

భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో చనిపోయిన భిక్కనూరు వార్డు సభ్యుడు బల్యాల సిద్ధరాములు మృతదేహంతో ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఇంటి ముందు గ్రామస్తులు సోమవారం ధర్నా చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధరాములు మృతి చెందిన విషయం విధితమే. ఈ ప్రమాదానికి కారణమైన భిక్కనూరుకి చెందిన డ్రైవర్ బల్యాల నవీన్ ఇంటి ఎదుట కుటుంబ సభ్యులు ఆటోలో మృతదేహాన్ని తీసుకువచ్చి ధర్నా నిర్వహించారు. దాదాపు ఐదు గంటల పాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రమాదంలో నవీన్ కూడా గాయపడ్డాడని, చావు బతుకుల మధ్య ఉన్నాడని తండ్రి బాల్‌రాజు ప్రజలను వేడుకున్నాడు. బాధిత కుటుంబానికి రూ.ఐదు లక్షలు ఇచ్చేలా నవీన్ కుటుంబ సభ్యులను ఒప్పించడంతో ఆందోళన విరమించారు.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి అరెస్టు

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామానికి చెందిన గుమ్మడి అంజయ్య పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ జూలై 2న మృతి చెందాడు. ఆయన ఆత్మహత్యకు కారణమైన ఇద్దరిని పోలీసులు సోమవారం రిమాండ్‌కు తరలించారు. తన తండ్రి మృతికి తల్లి రాజమణి, ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్న బోనాల దత్తు కారణమని రచన ఫిర్యాదు చేసింది. తన తండ్రి బతుకు దెరువు కోసం గల్ఫ్ వెళ్లి ఆరు నెలల క్రితం వచ్చాడని, తన తల్లి వివాహేతర సంబంధం విషయం తెలిసి గొడవ పడ్డారన్నారు. దీంతో పుట్టింటికి వెళ్లిపోయిన తల్లి నిజామాబాద్‌లో కేసు పెట్టిందన్నారు. దీంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. రాజమణి, బోనాల దత్తు ఆదివారం ద్విచక్రవాహనంపై వస్తుండగా బీర్కూర్ చౌరస్తాలో పోలీసులు పట్టుకుని సోమవారం కోర్టులో హాజరుపర్చారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్ సీజ్

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ శివారులో పెద్దవాగు తారు రోడ్డు మీద కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను సోమవారం ఎస్సై భాస్కరాచారి సీజ్ చేశారు. రోడ్డుపై కేజ్‌వీల్స్‌కు ఎలాంటి పట్టీలు లేకుండా వెళ్లి రోడ్డు ధ్వంసం చేసినందుకు కేసు నమోదు చేశామన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన వడ్ల శ్రీకాంత్(28) గ్రామ శివారులోని మల్లారెడ్డి చెరువులో చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. శ్రీకాంత్ ఈ నెల 5న రాత్రి కల్లు తాగి చేపలవేట కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతని జాడకోసం కుటుంబసభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. కాగా సోమవారం గ్రామశివారులోని మల్లారెడ్డి చెరువులో అతని మృతదేహం తేలింది. కల్లు తాగినమత్తులో చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- పదోతరగతి గ్రూప్‌లో సెల్ఫీ వీడియో
- ఆస్పత్రికి తరలింపు.. పరిస్థితి విషమం



సెల్ఫీ వీడియోలో గడ్డిమందు డబ్బా చూపుతున్న అనిల్

డిచ్‌పల్లి: నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన జనార్దన్ అనిల్ అనే యువకుడు సెల్ఫీ వీడియోతో తీసుకుని ఆదివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తన పదోతరగతి ఫ్రెండ్స్ గ్రూప్‌లో సెల్ఫీ వీడియో పోస్టు చేయడంతో గమనించి స్నేహితులు వెంటనే అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సోషల్ మీడియాలో వైరలైన వీడియోలో అనిల్ మాట్లాడిన మాటలు.. 10 క్లాస్ గ్రూప్ సభ్యులకు నమస్కారం ..నా పేరు అనిల్.. అరేయ్ ఇంటి విషయంలో నాకు అన్నకు గొడవ అయింది. ఊర్లో పంచాయతీ కూసుండబెట్టి న్యాయం చేస్తామని చెప్పి తోలుకెళ్లారు. అక్కడ నాకు అన్యాయం జరిగింది. ఈ డబ్బా మందు తాగి చనిపోవాలని అనుకుంటున్నాను, నన్ను క్షమించండిరా.. దయచేసి నా కుటుంబ సభ్యులకన్నా న్యాయం చేయాలని కోరుతున్నాను. నన్ను క్షమించండి రా.. మిమ్మల్ని విడిచి వెళ్లిపోతున్నందుకు.. నా పిల్లలకు, నా భార్యకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నాను.. అందరికీ సెలవు.. అంటూ కన్నీళ్లతో ముగించాడు. ప్రస్తుతం జిల్లా జనరల్ ఆస్పత్రిలోని ఐసీయూలో అనిల్ చికిత్స పొందుతున్నాడు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు భార్య గంగవేణి తెలిపారు. సోమవారం గంగవేణి తన అత్త ఈశ్వరమ్మ, బావ సునీల్ పై డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కులాంతర వివాహం చేసుకున్నందుకు తనను, భర్తను అత్త, బావలు వేధింపులకు గురి చేయడం, ఆస్తి విషయంలో అన్యాయం చేయడంతో అనిల్ ఆత్మహత్యయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చట్టప్రకారం అత్త, బావలపై చర్యలు తీసుకోవాలని కోరారు. గంగవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పిట్లం: పిట్లంలోని నేతాజీనగర్ కాలనీకి చెందిన పడిగెల నారాయణ ఇంట్లో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. ఒకే సారి ఇంట్లో మంటలు చేలరేగాయి. కిటికీలోంచి పొగలు రావడం చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇంట్లో ఉన్న వారిని బయటకు తీసుకొచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి.

ఉరి పడి లేగదూడ మృతి



మాక్లూర్: చెట్టుకు కట్టేసిన లేగదూడ ఉరి పడి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మండలంలోని వల్లభాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగాధర్ తన లేగదూడను రోజూలాగే చెట్టుకు కట్టేసి పడుకున్నాడు. ఉదయం లేచేసరికి ఆ తాడు మెడకు చుట్టుకొని లేగదూడ చనిపోయింది. తాను నిర్లక్ష్యంగా కట్టేయడంతోనే పశువు చనిపోయిందని రైతు రోదించాడు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

బాన్సువాడరూరల్: మండలంలోని సోమేశ్వర్ గ్రామానికి చెందిన పసుపుల రాజు ఆదివారం రాత్రి గ్రామ శివారులో ఉరి వేసుకున్నట్లు బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. రాజు మద్యానికి బానిస అయి జులాయిగా తిరిగేవాడు. ఏడాది క్రితం వివాహం కాగా రాజు తీరు నచ్చక భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఆదివారం తాగడానికి డబ్బులు అడగ్గా కుటుంబ సభ్యులు ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి మొగులయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరు..

కామారెడ్డి క్రైం: అనారోగ్య కారణాలతో ఒకరు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. గ్రామానికి చెందిన ముదర్కర్ రాజు (42) మటన్ విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. కొద్దిరోజులుగా అతడు తలనొప్పి, కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అతనికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె సైతం అనారోగ్యం కారణాలతో బాధపడుతుంది. వారం క్రితం అతని భార్య తన పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం ఉదయం దేవునిపల్లికి తిరిగి వచ్చింది. అప్పటికే ఇంటి వెనుక భాగంలో ఉన్న రేకుల షెడ్డులో రాజు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. అనారోగ్య కారణాలతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య రూప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

దోమకొండ: దోమకొండలో సోమవారం నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీలో నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడినట్లు ఎస్సై మురళి తెలిపారు. బీబీపేటకు చెందిన వెంకటేష్, అంచనూరుకు చెందిన మహేష్, శేఖర్, ఇసన్నపల్లి గ్రామానికి చెందిన నర్సింలు డ్రంకన్ డ్రైవ్‌లో దొరికారని చెప్పారు. వీరికి కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్ష, రూ.200 చొప్పున జరిమానా విధించారన్నారు.

మహిళ అదృశ్యం

నిజాంసాగర్: మండలంలోని కొమలంచ గ్రామానికి చెందిన బేగరి ప్రమీల అదృశ్యమైనట్లు ఏఎస్సై రాజేశ్వర్ తెలిపారు. ఈ నెల 5న ఇంటి నుంచి పొలానికి వెళ్లిన ఆమె రాత్రి వరకు ఇంటికి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె భర్త శ్రీనివాస్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.